క్లుప్తంగా

సేవలు అభినందనీయం

రాజుపాళెం: టంగుటూరు పంచాయతీ కార్యదర్శి కొట్టి బాబు సేవలు అభినందనీయమని ఎంపీడీఓ సయ్యదున్నీసా పేర్కొన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో బాబును ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్‌లు సన్మానించి ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రొద్దుటూరు : పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ద్వారా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. పోరెడ్డి సుజాత ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక శివాలయంలో సోమవారం మధ్యాహ్నం 1000 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పోరెడ్డి తనయుడు సందీప్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి నాగేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఓబుళరెడ్డి, శివోహం కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దువ్వూరు : మండలంలోని గుడిపాడు వద్ద ఉన్న 132 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ మోటార్లకు, ఇళ్లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోదీ విధానాలు లౌకిక వాదానికి ప్రమాదం

ప్రొద్దుటూరు : ప్రధాని మోదీ విధానాల వల్ల దేశంలో లౌకిక వాదానికి పెనుప్రమాదం దాపురించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. స్థానిక సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు సుబ్బరాయుడు, సత్యనారాయణ ఆధ్వర్యంలో మోదీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి ప్రచార భేరిలో భాగంగా సోమవారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటి కారుచౌకగా తెగనమ్మి భావితరాలకు తీరని ద్రోహం చేస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రద్దు చేసేందుకు కుట్ర పన్ని నిధులను విడుదల చేయడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, సమితి సభ్యులు శివారెడ్డి, యేసోబ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కత్తులతో దాడికి యత్నం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మున్సిపల్ కార్యాలయం రోడ్డులో ఇద్దరు యువకులు మరో యువకుడిపై కత్తులతో దాడికి యత్నించారు. పోలీసులు తెలిపిన మేరకు.. సిద్ధిఖ్ మున్సిపల్ రోడ్డులోని ఒక మొబైల్ షాపులో పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం సిద్ధిఖ్‌కు అతని స్నేహితులతో చిన్నపాటి గొడవ జరిగింది. దీన్ని మనసులో పెట్టుకున్న షబీల్ అహ్మద్, గైబూసా సోమవారం సిద్ధిఖ్ పని చేస్తున్న మొబైల్ షాపు వద్దకు వెళ్లి రాళ్లు విసిరారు. తర్వాత లోపలికి వెళ్లి కత్తులతో బెదిరించారు. సిద్ధిఖ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

ఎకో పార్కును ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం

- పార్కు అభివృద్ధికి రూ. 1 కోటి ఇస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే రాచమల్లు
- అటవీ అధికారులు, వాకర్స్ అసోసియేషన్, ప్రముఖులతో సమావేశమైన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



పార్కు నిర్వహణ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కును రాయలసీమలోనే ఎక్కడా లేని విధంగా అందంగా.. ఆహ్లాదంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం, ఆనందం ఇచ్చేలా అన్ని వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకోసం రూ. 1 కోటితో పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. సోమవారం ఉదయం పార్కులో ప్రొద్దుటూరు ఏకో ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు ఇక్కడి నేషనల్ పార్కులో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలో అటవీ అధికారులతో పాటు వాకర్స్, ప్రముఖులు, పుర ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వాకర్స్, చిన్న పిల్లలు, పెద్దలు, కుటుంబ సమేతంగా వచ్చే వారి కోసం వివిధ రకాల అభివృద్ధి పనులు చేసేందుకు ప్రజల భాగస్వామ్యం కావాలని డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి ఎమ్మెల్యేతో అన్నారు. పార్కులో ప్రజలు ఫోటో షూట్ చేసుకోవడంతో పాటు బర్త్‌డే వేడుకలు చేసుకునేలా ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు. ఇందుకు సుమారు రూ. 1 కోటి వరకు ఖర్చు అవుతాయని డీఎఫ్‌ఓ చెప్పారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడారు.

పార్కు అభివృద్ధికి రూ. 1 కోటి ఇస్తాం..

ప్రొద్దుటూరు ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం, ఆనందాన్ని ఇచ్చే రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కు అభివృద్ధి కోసం రూ. 1 కోటి ఇస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. మొదటి విడతగా నాలుగు రోజుల్లో రూ. 50 లక్షలు ఇస్తానని, పనులు పూర్తి అయ్యాక మిగతా రూ. 50 లక్షలు ఇస్తామన్నారు. అభివృద్ధి పేరుతో నా ఊరి ప్రజలపై ఒక్క రూపాయి భారం కూడా వేయొద్దని పూర్తిగా తానే భరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఇంత పెద్ద విస్తీర్ణములో ఇలాంటి పార్కు రాయలసీమలో ఎక్కడా లేదన్నారు. పార్కులో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ప్రజలకు మేలు జరుగుతుందనేది తనతో పాటు డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి ఉద్దేశమన్నారు. ఇక్కడ స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేయాలని పలువురు వైద్యులు సూచించారన్నారు. చిన్న పిల్లల కోసం రూ. 30 లక్షలతో ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి పరుస్తున్నామని చెప్పారు. అలాగే యువకుల కోసం జిమ్మును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వీటన్నింటి కోసం రూ. 1 కోటి నిధులు అవసరం అవసరమవుతాయని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ లక్ష్మీదేవి, సబ్‌డీఎఫ్‌ఓ దివాకర్, డీఆర్‌ఓ లక్షుమయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున, సభ్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, అక్రమ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణ సిబ్బందికి వేతనాలు పెంచేందుకు చర్యలు

పార్కులోపల క్లీనింగ్, ఇతర నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వారికి ఇప్పటి వరకు రూ. 5వేలు, రూ.6 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డితో మాట్లాడి వేతనాలు పెంచేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

'జగనన్న మన ప్రభుత్వం'కు విశేష స్పందన

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించిన జగనన్నే మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పరిపాలన తీరును తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో స్వయంగా తాను ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల స్పందనను గమనించానన్నారు. జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించకముందు తనకున్న అభిప్రాయం వేరు, కార్యక్రమం నిర్వహించాక ప్రజల్లో వచ్చిన స్పందనను చూసి వచ్చిన అభిప్రాయం వేరని తెలిపారు. తన అంచనాకంటే వంద రెట్లు ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా స్పందించారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ రెడ్డి కుటుంబంతోపాటు అనేక మందికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. లంచం లేకుండా, రెకమెండేషన్ లేకుండా చెప్పిన ప్రకారం చెప్పినట్లుగా సీఎం పథకాలు అందించారన్నారు. పాదయాత్రలో లోకేష్, బస్సు యాత్రలో చంద్రబాబు జగన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారే తప్ప సంక్షేమ పథకాల గురించి మాట్లాడటం లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ కన్వీనర్ పోసా భాస్కర్, రాజుపాళెం మండల కన్వీనర్ రాజశేఖర రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, రాజారాంరెడ్డి, రాజుపాళెం జెడ్పీటీసీ జీరెడ్డి అంజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యకు ఈనెల 26 వరకు గడువు

చాపాడు : చాపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మిషన్ వాత్సల్య పథకం కోసం అర్హులైన వారు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. తల్లి, దండ్రులతో ఒకరి ఆదరణ లేని 18 ఏళ్లలోపు వారికి కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.4వేలు ఆర్థిక సాయం అందించేందుకు మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామాలలో అంగన్వాడీ వర్కర్లు, జీఎంఎస్‌కేలు అర్హులైన వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

గోపవరం : స్పందన ద్వారా వస్తున్న అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన స్పందనలో పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బందితో పాటు హౌసింగ్ అధికారులు నిరంతరం పరిశీలించాలన్నారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్, ఎంఈఓ చెన్నయ్య, ఏపీఎం శివప్రసాద్, ఏపీఓ జయచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి



పాలిసెట్ మెటీరియల్‌తో విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి తెలిపారు. సోమవారం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాయలంలో పీవీఆర్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రమణ సహకారంతో పాలిసెట్ మెటీరియల్ 100 మంది విద్యార్థులకు ఉచితంగా అందించారు. ఏప్రిల్ 16 నుంచి జేవీవీ కార్యాలయంలో విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు జేవీవీ పట్టణ కార్యదర్శి కళ్యాణ్ కష్ణ తెలిపారు. పీవీర్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రమణ మాట్లాడారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా నాయకులు మురళీగుప్త, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, మధుసూదన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మాబువల్లి, అక్షత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, అందులో భాగంగా మున్సిపాలిటీలో 90 శాతం, ఇతర మండలాల్లో 75 శాతం మేర సర్వే పూర్తయిందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 22 వేల కుటుంబాలు, 7 మండలాల్లో 60 వేల పైచిలుకు కుటుంబాలను గృహసారథులు కలిసి గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య తేడాలను వివరించగా అధిక శాతం మంది జగనన్న పాలనకే జై కొట్టారని అన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఒక వరం



రికార్డులను తనిఖీ చేస్తున్న ఖాదర్‌వలి

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక వరం లాంటిదని అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. సోమవారం మండలంలోని అన్నలూరు గ్రామ సచివాలయం పరిధిలోని చాటపల్లెలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమాన్ని సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై అవగాహన లేని వారికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తూ వైద్యం అందిస్తున్నామని అన్నారు. జీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రాధ, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా దరఖాస్తుకు మరో అవకాశం

గోపవరం : రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందించే రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు ఏఓ అరవిందనాయక్ తెలిపారు. ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి నామినీకి సంబంధించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, రైతులు తమ ఆధార్‌కార్డు, 1బి, మొబైల్ నెంబర్‌ను తీసుకుని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా 'ఏజెంట్' ఆడియో వేడుక

ప్రొద్దుటూరు క్రైం : యువ నటులు అక్కినేని నాగ చైతన్య, అఖిల్ నటిస్తున్న ఏజెంట్ చిత్రం పాటల విడుదల సందర్భంగా సోమవారం పట్టణంలోని ఆరవేటి థియేటర్‌లో ఆడియో వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో కడప జిల్లా అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ ప్రెసిడెంట్ నల్లం రవిశంకర్, సినిమా పంపిణీ దారుడు శోభన్‌బాబు, థియేటర్ అధినేత ఆరవేటి నాగరాజు, అక్కినేని అభిమానులు సత్యనారాయణ, పీరయ్య, డీఎం బాషా, గణేష్, ఖలీల్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని రవిశంకర్ తదితరులు ఆకాంక్షించారు.

విజిలెన్స్ అధికారుల మెరుపుదాడులు

అట్లూరు : అక్రమ విద్యుత్ వినియోగదారులపై విజిలెన్స్ అధికారులు సోమవారం ముమ్మర దాడులు నిర్వహించారు. మండల పరిధిలో విజిలెన్స్ అధికారులు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం అందడంతో స్థానిక విద్యుత్ ఏఈ విజయకుమార్‌ను వివరణ కోరగా కడప నుంచి విజిలెన్స్ అధికారులు పలువురిపై కేసులు నమోదు చేశారని, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 6 మందిపై, అధిక లోడు వినియోగిస్తున్న 23 మందిపై మొత్తం 29 మందిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారని ఆయన తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



రోడ్డు పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి

బద్వేలు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.30 కోట్లు పైనే వెచ్చించి రోడ్లను నిర్మిస్తోందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆయన పోరుమామిళ్ల మండలంలో చెన్నారెడ్డిపేట నుంచి పుల్లివీడు వరకు రూ.3.40కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుల్లివీడులోని సచివాలయానికి పంచాయతీలోని ఇతర గ్రామాల ప్రజలు వెళ్లాలంటే 11 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉందన్నారు. రోడ్డు పూర్తయితే నాలుగు కిలోమీటర్ల మాత్రమే ఉంటుందన్నారు. బద్వేలు ప్రధాన రహదారి నుంచి కడప ప్రధాన రహదారికి లింక్ రోడ్డు ఏర్పడుతుందని చెప్పారు. కాలువకట్ట నుంచి రామాయపల్లెకు రూ.4.80 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. కట్టకిందపల్లె, దమ్మనపల్లె ప్రజలకు దారి ఇబ్బందులు తీరతాయన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలోని మండలాల్లో నెలకొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణను అమలు చేసి పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ ఆకులవెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు పరిసర ప్రాంతాల్లో ఉన్న డీకేటీ ఇళ్ల స్థలాల సమస్య, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వంటి అంశాలపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌తో చర్చించి అర్హులైన వారికి రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం పలు జీఓల ద్వారా ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల నిర్మాణాలు, రెండవ దశలో ఖాళీ స్థలాలు క్రమబద్ధీకరిస్తామన్నారు. ఇందులో భాగంగా తొలుత బద్వేలు మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన డ్రోన్ సర్వే ద్వారా 11 వేల నిర్మాణాలు రెగ్యులరైజ్ చేసేందుకు గుర్తించామని, ఇందులో సబ్ డివిజనల్ కమిటీ విచారణ ద్వారా క్రమబద్ధీకరిస్తామని తెలియజేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరపడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగడంతోపాటు పూర్తిస్థాయి హక్కులు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇందులో కూడా ఏవైనా అభ్యంతరాలు గుర్తించేందుకు విచారణలో సిద్ధం చేసిన జాబితాను ఆయా సచివాలయాల్లో, తహసీల్దారు కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేసుకున్న వారిని కూడా రెండవ దశలో గుర్తించి ఎవరైతే నిజమైన అర్హులు రెండు సెంట్లలోపు నిర్మాణం చేసుకున్నారో వారికి ఉచితంగా డీకేటీ పట్టా రెగ్యులరైజ్ చేయనున్నట్టు తెలిపారు. చెరువులు, కుంటలు, వంక పోరంబోకు స్థలాలు, ప్రజా అవసరాల దృష్ట్యా కేటాయించిన స్థలాల ఆక్రమణలను ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటికే సర్వేల ద్వారా ఆక్రమిత స్థలాలను గుర్తించామని, రెండు, మూడు నెలల్లో పూర్తిస్థాయి ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ జీవన్‌చంద్రశేఖర్, బద్వేలు, గోపవరం తహసీల్దార్లు మదుసూదన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం



సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎంపీపీ, అధికారులు



అవార్డులను అందుకుంటున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి



బద్వేలు అర్బన్: సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

చాపాడు : గ్రామ పంచాయతీల అభివృద్ధితోనే మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీరాజ్ శాఖ ప్రాముఖ్యత ముఖ్యమైందన్నారు. అన్ని రంగాలలో గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నీటి సంవృద్ధి, హరిత గ్రామ పంచాయతీ, స్వయం సంవృద్ధి, మౌలిక సదుపాయాలు, మహిళలు, పిల్లల స్నేహపూర్వకం గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, పేదరికం లేని మెరుగైన సామాజిక భద్రత, సుపరిపాలన వంటి అంశాలలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లను ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లె పంచాయతీకి అవార్డులు

ప్రొద్దుటూరు : పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వివిధ అంశాల ఆధారంగా మండలంలోని గ్రామ పంచాయతీలకు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ 9 ఎస్‌డీజీ గోల్స్‌కు సంబంధించి నేషనల్ పంచాయతీ పోర్టల్‌లో గ్రామ పంచాయతీల వారీగా నమోదు చేసిన సమాచారం మేరకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా గ్రామ పంచాయతీల ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించామన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధుల కల్పన, పరిశుభ్రమైన హరిత గ్రామ పంచాయతీ, పిల్లల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీ, నీటి సమృద్ధి కలిగిన గ్రామ పంచాయతీ అంశాలలో కొత్తపల్లె గ్రామ పంచాయతీ నాలుగు అవార్డులు సాధించిందన్నారు. పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి ఈ అవార్డులను అందించారు. వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, ఈఓపీఆర్డీ పరమేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గురుమోహన్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో పటిష్టమైనది

బద్వేలు అర్బన్ : పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో పటిష్టమైనదని బద్వేలు ఎంపీపీ బిజివేముల రమణమ్మ పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. అనంతరం మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన సర్పంచ్‌లను సన్మానించారు. ఉత్తమ పంచాయతీగా పుట్టాయపల్లె ఎన్నికై జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్ చేతులమీదుగా అవార్డు అందుకోవడంపై ఎంపీపీ, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల కన్వీనర్ రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, సుబ్బనరసింహులు, గంగమ్మ, ఓబులేసు, అనూష, రమాదేవి, నరసమ్మ, పద్మావతి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకం

బద్వేలు : పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకపాత్ర పోషిస్తున్నారని పోరుమామిళ్ల వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ పంచాయతీలైన దమ్మనపల్లె, సంచర్ల, పుల్లివీడు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శాలువా, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. వీటితో వివిధ అంశాల్లో పంచాయతీలు సాధించిన అభివృద్ధిని ప్రోత్సహిస్తూ సర్పంచ్‌లు, కార్యదర్శులను సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహన్, ఈఓపీఆర్డీ భాస్కర్‌బాబు, ఈఓ సుబ్బారెడ్డి, పుల్లివీడు సర్పంచ్ పాల్గొన్నారు.

పంచాయతీకి ఊపిరి కార్మికులే

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్పంచ్ సుధాకర్ కార్మికులకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ 73 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంచాయతీకి ఊపిరి లాంటి కార్మికులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీలో కార్మికులు చేస్తున్న సేవల వలనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉందన్నారు. కార్యదర్శి సుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హరి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలి

కాశినాయన : గ్రామ పంచాయతీలను బలోపేతం చేసి స్వపరిపాలన సంస్థలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ముజఫర్ రహీమ్ తెలిపారు. సోమవారం నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను పూలమాల, శాలువాలతో సన్మానించారు. పంచాయతీరాజ్‌లోని 9 విభాగాలలో అభివృద్ధి కనబరిచిన పంచాయతీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆచారి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు సందీప్, పుల్లయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రత్యూష, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజుపాళెం నుంచి తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామం నుంచి తిరుమలకు సోమవారం పాదయాత్రగా 150 మంది భక్తులు వెళ్లారు. ముందుగా గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఇలా పాదయాత్రగా తిరుమలకు ఐదవసారి అని, పాదయాత్ర కమిటీ సభ్యులు జయరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రసాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో పాదయాత్ర భక్తులకు టిఫిన్, భోజన వసతి చేసినట్లు తెలిపారు. 29వ తేదీ శనివారం సాయంత్రానికి తిరుమలకు చేరుకుంటామని, ఆదివారం కలియుగ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని వస్తామన్నారు. ఇందులో మహిళలు వెళ్లడం విశేషం.